కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 50, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 50, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 60, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 350.

18న జేఎన్‌వీ ఆరో తరగతి ప్రవేశపరీక్ష

రాయదుర్గం: జేఎన్‌వీలలో ఆరవ తరగతిలో అడ్మిషన్లు 2025–26 విద్యాసంవత్సరానికి దేశ వ్యాప్తంగా ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించనున్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలో ఇప్పటికే గుర్తించిన ప్రవేశ పరీక్ష కేంద్రాలలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ టి గోపాలకృష్ణ తెలిపారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 9 జేఎన్‌వీలు ఉండగా వచ్చే ఏడాది నుంచి కొత్తగా జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్–మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు జేఎన్‌వీలు మంజూరయ్యాయని తెలిపారు. తెలంగాణలో మొత్తం 16 జేఎన్‌వీలు ఉన్నాయి.

'మనూ'లో 23న వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ (ఐఎంసీ) ఆధ్వర్యంలో జనవరి 23న ఒకరోజు వర్క్‌షాప్ జరుగుతుందని ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలవారు జనవరి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రముఖ కమ్యూనిటీ రేడియో నిపుణులు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ వినోద్ పవరాల, ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, మన టివి మాజీ సీఈఓ డాక్టర్ వి రామారావు, కేంద్ర సమాచార శాఖ సీఆర్‌ఎస్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అమిత్ ద్వివేది ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో సమర్థవంతమైన రేడియో కమ్యూనికేషన్ ద్వారా సామాజిక మార్పును అవసరమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం, సుక్షితులుగా చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తామన్నారు.

ఎస్‌ఐగా నాగరాజుకు పదోన్నతి



మియాపూర్: మియాపూర్ పీఎస్ ఏఎస్‌ఐ నాగరాజుకు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ క్రాంతి కుమార్‌లు నాగరాజుకు మరో స్టార్ బ్యాచ్‌ను అందించారు. నార్సింగ్, జగద్గిరిగుట్ట, మియాపూర్ తదితర పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించాడు. ఈ సందర్భంగా సిబ్బంది నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించి ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ కల్పన బుధవారం తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం, అలాగే 6 నుంచి 9వ తరగతిలో ఏర్పడిన ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను కోరుతున్నామన్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 23వ తేదీ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు కోసం కులధ్రువీకరణపత్రం, ఆదాయ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు నంబర్ (జిరాక్స్ ప్రతి), బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

శ్మశానవాటికకు నూతన గేటు ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్: నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలో శ్మశాన వాటిక గేటు, గోడ సమస్య ఉందని సంఘం సభ్యులు ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కార్పొరేటర్ సొంత నిధులతో గేటును ఏర్పాటు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

గచ్చిబౌలి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అస్సాంకు చెందిన నారాయణ్ హజారిక(55) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో విధులు ముగించుకొని నడుచుకుంటూ వస్తుండగా బొటానికల్ గార్డెన్ వర్చువల్ సఫారీ గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో నారాయణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కొండాపూర్ సియాలైఫ్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రంజన్ హజారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చందానగర్‌లోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాల

సమస్యలు ఇవే..

- ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులుండగా.. రెండు గదులు ఉన్నాయి. అంగన్‌వాడీకి మాత్రం మూడు గదులు ఉన్నాయి.
- 5 తరగతుల విద్యార్థులు రెండు గదులలోనే కూర్చుంటున్నారు
- కాగా పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుతోంది. స్కూలు ముందు చెత్త వేస్తున్నారు.
- ఇక ఇష్టానుసారంగా స్కూలు వద్ద వాహనాలు నిలుపుతున్నారు.
- విద్యార్థులకు ఆట స్థలం లేదు. దాతల సహాయంతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు
- ప్రభుత్వం స్పందించి పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

2 గదులు.. 5 తరగతులు

శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో అరకొర వసతులు • ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

చందానగర్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమం ప్రవేశపెట్టింది. ఇందులో పలు పాఠశాలలు అభివృద్ధికి నోచుకున్నాయి. కానీ ఐటీ ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న చందానగర్ శాంతినగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థ పడుతున్నారు. ఈ ప్రాంతంలోని పేద, బలహీన వర్గాల పిల్లలు ఈ పాఠశాలకు వస్తుంటారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. రెండు గదుల్లో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పాఠశాల సమస్యలపై ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయాలని కోరారు.



5 తరగతుల నిర్వహణ ఈ రెండు గదుల్లోనే..



పాఠశాల ఎదుట చెత్త చెదారం, మట్టికుప్పలు

ఇరుకు గదులలో విద్యా బోధన



ఇరుకు గదులలో విద్యా బోధన చేస్తున్నారు. పిల్లలకు పాఠాలు అర్థం కావడం లేదు. వెంటనే 5 తరగతులకు ఐదు గదులు నిర్మించాలి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించాలి.
– రాజు, శాంతినగర్

కనీస వసతులు కల్పించాలి



శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అరకొర వసతులున్నాయి. భవనానికి మరమ్మతులు చేయాలి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
– కృష్ణ, శాంతినగర్

శిల్పారామం.. సంక్రాంతి సంబురాలు

- పాల్గొన్న 37వేల మంది సందర్శకులు
- అలరించిన గంగిరెద్దు, హరిదాసుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- బుధవారం 18వేల మందికి పైగా నగరవాసుల సందర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటాయి. బుధవారం నగరవాసులు అధిక సంఖ్యలో పాల్గొని సరదాగా గడిపారు. సంబురాలలో గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమ దేవరలు, ఎరుకలసాని ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో యక్షగానం, గారడి గొంబే జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కనుమ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో శ్రీ శ్రీనివాస సంస్థాన్ వారు మహిషాసుర మర్ధిని, యక్షగానం, నాట్యగురువులు పద్మకళ్యాణ్ శిష్యబృందంచే వినాయకకౌతం, జయజయ దుర్గే, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు డాక్టర్ జ్యోతి శేఖర్, లహరి, తన్మయి, జానకిశృతి, త్రిపుర, శ్రీలక, ఆద్య, సహస్ర, ఉదయశ్రీ, అవంతిక, వరుణ్య, లక్ష్మి, హాసిని తదితరులు ప్రదర్శించారు.









ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా ప్రొ.సురజిత్‌ధారా



రాయదుర్గం: హెచ్‌సీయూ ప్రొఫెసర్ సురజిత్‌ధార బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్–2025 ఫెలోగా ఎన్నికయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లో ఆయన విధులను నిర్వహిస్తున్నారు. లిక్విడ్ క్రిస్టల్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి లిక్విడ్ క్రిస్టల్ పరికరాల సాంకేతికతను ఆయన అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఘనంగా గోదా కల్యాణం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. దేవాలయం ఆవరణలో ప్రత్యేక కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేసి మంత్రోచ్చారణల మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవి వృత్తాంతాన్ని అర్చకులు వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

దరఖాస్తుల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్లు సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన మొత్తం 7000 దరఖాస్తులు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలకు చెందిన 25 మందిని కేటాయించామన్నారు. వీరికి బుధవారం ఉదయం సర్కిల్ కార్యాలయంలో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు పరిశీలన కొనసాగుతుందన్నారు.



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో రాష్ట్రీయ కళామంచ్ ఆధ్వర్యంలో 'కైట్ ఫ్లైయింగ్' పేరిట గాలిపటాలు ఎగురవేశారు. ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్, ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్ష, కార్యదర్శి అనిల్‌కుమార్, ఆయుష్‌కుమార్‌సింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ, రాష్ట్రీయ కళా మంచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.
– రాయదుర్గం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రాయదుర్గం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి, రాయదుర్గం, వినాయక్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి, టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమ్, కొండాపూర్, సాయిఐశ్వర్య, గౌలిదొడ్డి, కొత్తగూడ, గచ్చిబౌలి, రాయదుర్గం, శ్యాంలేట్‌వీధి, మధురానగర్, ఎన్టీఆర్ కాలనీల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఊరపోచమ్మ అమ్మవారు



పోచమ్మ తల్లి

గుల్‌మొహర్‌పార్కును సందర్శించిన ఎమ్మెల్యే గాంధీ


శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్ కాలనీ పార్కును ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సందర్శించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పార్కుకు వచ్చారు. మనవడు ఆర్యవీర్, మనవరాలు అన్యతో కలిసి పార్కులో ఉన్న కుందేళ్ళు, బాతులు, కోళ్ళు, ఇతర పక్షులతో సరదాగా గడిపారు. పార్కులో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందంటూ కాలనీ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఖాసీం, ప్రతినిధులు ఆనంద్, నాయకులు అనిల్, రాజేందర్, కాశీనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గుల్‌మొహర్‌పార్కులో ఎమ్మెల్యే గాంధీ

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

చందానగర్: విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంధ్య తెలిపిన ప్రకారం. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌కు చెందిన ఫ్రాంక్లిన్ ఫిలిప్స్ (27) జిమ్ ట్రైనర్. బీహెచ్‌ఈఎల్‌కు చెందిన మైలారం స్వర్ణలతను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి రెండేళ్ళ కూతురు. కాగా సంక్రాంతి పండుగ సందర్భంగా కోకాపేట్‌లో ఉంటున్న స్నేహితులు వంశీ, ప్రకాష్‌ల వద్దకు వెళ్ళాడు. అందరు కలిసి వైన్ తాగారు. బుధవారం తెల్లవారు జామున ఒంటి గంటకు తన బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో 1.30 గంటలకు నల్లగండ్ల అపర్ణ సరోవర్ వద్ద కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అక్కడ ఉన్న వ్యక్తులు వెంటనే పక్కనే ఉన్న సిటిజన్ హాస్పటల్‌కు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి భార్యకు సమాచారం ఇవ్వడంతో హాస్పటల్‌కు చేరుకొంది. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ఫ్రాంక్లిన్ ఫిలిప్స్ (ఫైల్)

ఉచిత గాలిపటాల పంపిణీ

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్యాంలేట్ వీధిలోని ఊరపోచమ్మ ఆలయం వద్ద గాలి పటాలు పంపిణీ చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమం ప్రచారంలో భాగంగా గాలిపటాలపై లక్ష గొంతులు, వెయ్యి డప్పుల కార్యక్రమంను గాలిపటాలపై ప్రింటు చేయించి వాటిని పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేఆర్ బస్తీ అధ్యక్షుడు సంజీవ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంలేట్ గణేష్, నాయకులు త్రినాద్, ఉపేందర్, మహేష్ పాల్గొన్నారు.



బంగారు చౌడమ్మ ఆలయంలో సంక్రాంతి జాతర ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హిమాయత్‌సాగర్ బంగారు చౌడమ్మ దేవాలయంలో సంక్రాంతి జాతర బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా సంక్రాంతి మరుసటి రోజు నుండి మూడు రోజుల పాటు జాతరను నిర్వహిస్తున్నారు. ఈ జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకుంటున్నారు. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలతో జాతరను ప్రారంభించారు. బ్యాండ్ చప్పుళ్లు.. శివసత్తుల శివాలుతో బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువకులు పెద్ద ఎత్తున సొడమ్మ గుట్టపై చేరుకొని పతంగులు ఎగరవేశారు. జాతర సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

6.5 కేజీల ఎండు గంజాయి స్వాధీనం

మియాపూర్: జైలుకు వెళ్లినా తన ప్రవర్తన మార్చుకోకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలోని పిల్లర్ నంబర్– 603 వద్ద మంగళవారం రాత్రి మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, మియాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా ఇంద్రాకుల గ్రామానికి చెందిన ఇంద్రకుమార్(27)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఎండు గంజాయిని గుర్తించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా అతను అరకులో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడని తెలిసింది. సంక్రాంతి పండుగకు స్వంత గ్రామానికి వస్తూ అరకు నుండి గంజాయిని తీసుకు వచ్చి స్థానికంగా విక్రయించేందుకు పథకం పన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి ఎక్కువ ధరకు అమ్మడానికి నిర్ణయించుకున్నాడు. గతంలో అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 గంజాయి కేసులు నమోదై పట్టుబడి గత ఏడాదిలో జైలుకు వెళ్లి వచ్చాడు. బయటకు వచ్చాక గంజాయి విక్రయం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో అతను మియాపూర్ పోలీసులకు పట్టుబడగా 6.5 కేజీల ఎండు గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు ఇంద్రకుమార్

వాల్వ్ లీకేజీలు.. నీరు రోడ్డు పాలు





రిక్షాపుల్లర్స్ కాలనీ పీజేఆర్ విగ్రహం వద్ద..

రహదారులు బురదమయం

ఆల్విన్‌కాలనీ: తాగునీటి లీకేజీలతో నీరు వృథాగా పోతోంది. దీనికితోడు కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలోని పీజేఆర్ విగ్రహం వద్ద ఉన్న రెండు వాటర్ వాల్వ్ లీకేజీలతో కొన్ని రోజులుగా గ్యాలన్ల కొద్దీ నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికి పలుమార్లు వాల్వ్‌లను సరిచేసినా సమస్య పునరావృతమవుతోందని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకవటంతో రోడ్డుపై వెళ్లే వాహనాల ధాటికి దుమ్ము, ధూళి చేరి రంగుమారిన నీరు సరఫరా అవుతుందని వాపోయారు. కాలనీలో రోడ్లు బురదమయం అవుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని తాగునీటి లీకేజీలను అరికట్టడంతో బాటు మంచినీటిని సరఫరా చేయాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మెయిన్ రోడ్డులో లీకేజీ